క్లుప్తంగా

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం

విజయనగరం టౌన్: పట్టణంలోని రింగురోడ్డు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహా సామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా రామాయణ పారాయణం, లక్ష్మీ హోమాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త టీకే చూడామణి గంగానది విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమాలను శ్రీనివాసా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా విజయ్‌కుమార్, చెరుకూరి శ్రీధర్ పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హరికథా పితామహుడికి నివాళులు

విజయనగరం టౌన్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసుకు ఆదిభట్ల ఆరాధనోత్సవ సంఘ ప్రతినిధులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా స్థానిక వెన్‌లాక్ పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు అప్పసాని రంగారావుదొర, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయానికి వంట సామగ్రి వితరణ

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం బోడికొండపై ఉన్న కోదండ రామాలయానికి భక్తులు వంట సామాగ్రిని మంగళవారం వితరణగా అందజేశారు. స్వామికి జరుగుతున్న నిత్య కైంకర్యాల నిమిత్తం విశాఖకు చెందిన శ్రీ బాలాజీ భక్త బృంద సభ్యులు విద్యుత్ స్టవ్‌తో పాటు గ్యాస్ స్టవ్‌ను అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో రామతీర్థం సేవా సంఘం ప్రధాన కార్యదర్శి సుదర్శనం విజయ్‌కుమార్, అర్చకులు కిరణ్, పవన్ పాల్గొన్నారు.

ఈవీఎం గొడౌన్ తనిఖీ

నెల్లిమర్ల: నెలవారీ తనిఖీల్లో భాగంగా నెల్లిమర్లలో గల జిల్లా స్థాయి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గొడౌన్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. సీసీ టీవీ ద్వారా లోపల ఉన్న ఈవీఎం యంత్రాల పరిస్థితిని తెలుసుకున్నారు. సీసీ టీవీలకు సంబంధించి ఎక్కువ రోజుల ఫీడ్ అవసరం ఉంటుందని, అందువల్ల ఎక్కువ స్టోరేజ్ కోసం హార్డ్‌డిస్క్‌లు సిద్ధం చేసుకోవాలని ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్‌కు సూచించారు. పర్యటనలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి. సహాదిత్ వెంకట్ త్రివినాగ్, ఆర్‌డీఓ ఎంవీ సూర్యకళ, నెల్లిమర్ల తహసీల్దార్ డి. ధర్మరాజు, డిప్యూటీ తహసీల్దార్ సూర్య, తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి

- డీపీఎం బాలాజీ

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలని డీపీఎం బాలాజీ అన్నారు. మంగళవారం స్థానిక ఏఆర్‌టీ కేంద్రంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హెచ్‌ఐవీ రోగుల మరణాల సంఖ్యను తగ్గించాలన్నారు. హెచ్‌ఐవీ రోగులతో పాటు ట్రాన్స్‌జెండర్లు, స్వలింగ సంపర్కులు, నిస్సహాయ మహిళలకు హెపటైటీస్ బీ, సీ పరీక్షలు చేయడంతో పాటు వ్యాక్సిన్ అందించాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ జ్యోతిర్మయి, సాక్షి గోపాలరావు, డి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో కొలువైన ఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత ఆంజనేయ స్వామికి వివిధ రకాల ఫల రసాలతో విశేష అభిషేకాలు, సింధూరం, తమలపాకులతో అర్చనలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్ కుమారాచార్యులు, రామగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ జనరల్ మేనేజర్ జయకుమార్ కందిమల్ల

విజయనగరం అర్బన్: శిక్షణ తరగతుల ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ జనరల్ మేనేజర్ జయకుమార్ కందిమల్ల అన్నారు. స్థానిక ఆర్‌కే టౌన్‌షిప్‌లోని జీఎంఆర్ వరలక్ష్మి ఉపాధి శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు తమ నైపుణ్యాలనే ఉపాధిగా చేసుకుని ప్రభుత్వ పథకాల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జీఎంఆర్, నాబార్డు అందించిన ధ్రువీకరణ పత్రాలను అభ్యర్థులకు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ ఫౌండేషన్ వరలక్ష్మి ఫౌండేషన్ అసోసియేట్ మేనేజర్ సీహెచ్ నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జ్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ..

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- పండగ వాతావరణంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన మహిళలు



రుణమాఫీ నమూనా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



కార్యక్రమానికి హాజరైన వేలాది మంది మహిళలు

నెల్లిమర్ల రూరల్/నెల్లిమర్ల: ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు నాలుగు విడతల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రుణమాఫీ చేశారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని థామస్‌పేట ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పట్టణ పరిధిలోని 406 స్వయం సహాయక సంఘాల్లోని 4,187 మంది మహిళలకు రూ.2.49 కోట్లు, గ్రామీణ పరిధిలో 1083 స్వయం సహాయక సంఘాల్లోని 11,950 మంది మహిళలకు రూ.7.83 కోట్ల రుణమాఫీ నమూనా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ... మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పలు సంస్కరణలు చేపట్టారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు ఆగకుండా ప్రజలకు అందించామన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పావలా వడ్డీ అందిస్తే.. ప్రస్తుత సీఎం జగనన్న హయాంలో ఆసరా పథకం ద్వారా పూర్తి రుణమాఫీ చేశారన్నారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు నాయుడు అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబు మామను పొడిచి ముఖ్యమంత్రి అయితే... జగనన్న ప్రజల్లో నడిచి ముఖ్యమంత్రి అయ్యారంటూ ఎమ్మెల్యే బడ్డుకొండ సెటైర్లు వేశారు.

మహిళలకు పెద్దపీట : అందవరపు

సీఎం జగనన్న ప్రభుత్వంలో మహిళలకు ఎంతో మేలు జరిగిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు అన్నారు. దాదాపు అన్ని పథకాల లబ్ధిని నేరుగా మహిళల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. మహిళలంతా మరోసారి జగనన్నకు అవకాశం ఇస్తే మరిన్ని పథకాలు ప్రవేశపెట్టి సొంత అన్నలా తోడుంటారన్నారు. ఈ సమయంలో మహిళలందరూ ఒక్కసారిగా జై జగన్ అంటూ నినాదాలు చేయడంతో సభ దద్దరిల్లింది. అనంతరం జగనన్న చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, ఏఎంసీ చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, మండల, పట్టణ అధ్యక్షులు చనమళ్ల వెంకటరమణ, చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం నాయుడు, మెప్మా పీడీ సుధాకరరావు, ఎంపీడీఓ రామారావు, కమిషనర్ బాలాజీప్రసాద్, ఏపీఎం సత్యనారాయణ, కార్పొరేషన్ డైరెక్టర్లు జనా ప్రసాద్, మద్దిల వాసు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెనతో మా ఇద్దరి పిల్లలను చదివించుకుంటున్నాను. అలాగే జగనన్న హౌసింగ్ స్కీమ్ ద్వారా ఇల్లు నిర్మించుకున్నాం. ఆసరా ద్వారా రూ.7045 రుణమాఫీ జరిగింది. ఈ ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉంటాం. – మజ్జి సుమతి, అధ్యక్షురాలు, శ్రీ సంతోషిమాత పొదుపు సంఘం, కొండపేట, నెల్లిమర్ల నగర పంచాయతీ

కుటుంబానికి అండగా...



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా కుటుంబానికి అండగా నిలబడింది. మా పొదుపు సంఘానికి 2,05,684 రూపాయల రుణం మంజూరైంది. గ్రూపు సభ్యులు ఒక్కొక్కరికీ రూ.4285 రుణమాఫీ జరిగింది. మా పిల్లలకు అమ్మఒడి రావడంతో మంచి చదువులు చదివిస్తున్నాను. గ్రూపు సభ్యులంతా అనేక సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందారు. –సారిపల్లి అమ్మాజీ, శ్రీ సాయిరాం మహిళా పొదుపు సంఘం సభ్యురాలు, కొండపేట, నెల్లిమర్ల నగర పంచాయతీ

మెరుగైన సేవలు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయి. గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్లు లేని నిరుపేదలకు సొంతగూడు కల్పించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయి. వైఎస్సార్ ఆసరాతో నా కుటుంబం ఎంతో లబ్ధి పొందింది. అమ్మఒడి పథకం కూడా అందింది. సచివాలయా ద్వారా మెరుగైన సేవలు అందుతున్నాయి. –కళ్యాణం శ్రీదేవి, గాంధీనగర్‌కాలనీ, నెల్లిమర్ల నగర పంచాయతీ

పెద్దకొడుకులా జగన్..



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంటికి పెద్ద కొడుకులా ఆదుకున్నారు. చెప్పిన మాట ప్రకారం రుణమాఫీ చేశారు. రైతుభరోసా వచ్చింది. మా గ్రామంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయి. గతంలో ఇలాంటి పాలన చూడలేదు. మళ్లీ ఈ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నాం. –మొయిద లక్ష్మి, కొండగుంపాం గ్రామం, నెల్లిమర్ల మండలం

రాష్ట్రంలో అవినీతిరహిత పాలన

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవినీతిరహిత పాలన అందిస్తున్నారని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని మూడో డివిజన్ వ్యాసనారాయణ మెట్ట నుంచి మంగళవారం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా ఆ ప్రాంతంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి కృషితో నగరం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాలుగో డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వేముల శివప్రసాద్, మెండారమణ, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పూసపాటిరేగ: మండలంలోని పతివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ బి. పాపినాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని రుచిచూసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు హెచ్ఎం సీహెచ్ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజస్వామి ఆరాధన



ర్యాలీలో ఆకట్టుకున్న త్యాగరాజ స్వామి వేషధారి మోడేకుర్తి కామేశ్వరరావు

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు, ఆదిభట్ల నారాయణదాసు వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి కొత్తపేట మంటపం వద్దనున్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనం వరకు తిరువీధి నిర్వహించారు. ప్రఖ్యాత వేణుగాన విద్వాంసులు మోడేకుర్తి కామేశ్వరరావు త్యాగరాజ స్వామి వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ అయ్యగారి రాఘవరావు, కాంభట్ల శ్రీధర్, ధవళ సర్వేశ్వరరావు, దూసి శివరామశర్మ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

జేసీ సేవలు ప్రశంసనీయం



జేసీ మయూర్ అశోక్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అందించిన సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. విశాఖపట్నం జేసీగా బదిలీపై వెళ్తున్న మయూర్ అశోక్‌ను కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్, జిల్లా పౌర సరఫరాల శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. జేసీ సేవలు, పనితీరు, సుగుణాలను ప్రశంసించారు. ఏ పనినైనా పూర్తి చేయాలన్న దృక్పథంతో ఉంటారని చెప్పారు. జేసీ పోస్టు చాలా కీలకమైనదని దానిని మయూర్ అశోక్ విజయవంతంగా నిర్వహించారని కొనియాడారు. జేసీ మయూర్ అశోక్ స్పందిస్తూ విజయనగరం జిల్లా ఎన్నో మంచి అనుబంధలను మిగిల్చిందన్నారు. ఇక్కడి ప్రజలు స్నేహపూర్వకంగా ఉంటారని అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తారని కొనియాడారు. డీఆర్‌ఓ అనిత, ఆర్‌డీఓ సూర్యకళ, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు తాడ్డి గోవింద, తహసీల్దార్ అరుణకుమారి, డీఎస్‌ఓ కె.మధుసూదనరావు, జేడీఏ తారకరామారావు వివిధ శాఖల జిల్లా అధికారులు జేసీతో తమకున్న అనుభందాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్డీలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సూర్య, సభ్యులు, మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



గుణుపూరుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

డెంకాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. మండలంలోని గుణుపూరుపేటలో జరుగుతున్న జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రోగుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ల్యాబ్ టెస్టులు, ఫార్మసీ, కంటి వైద్యశిబిరాలను పర్యవేక్షించారు. రోగులకు అందుతున్న సేవలపై డాక్టర్ భవానీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ భాస్కరరావు మాట్లాడుతూ, వైద్యశిబిరాల ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో 405 మంది రోగులకు వైద్యసేవలందించారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు మౌనిక, వెంకట భాస్కర్, ఆప్తాలమిస్ట్ మజ్జి గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన

మండలంలోని జొన్నాడ, బొడ్డవలస గ్రామ సచివాలయాల పరిధిలో లెప్రసీ అవగాహన సదస్సులు నిర్వహించారు. లెప్రసీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో జొన్నాడ సర్పంచ్ కోరాడ రమణి, బొడ్డవలస వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్ సూరిబాబు, సెక్రటరీ కె.బంగార్రాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో కార్పొరేట్ వైద్యం

- ఎంపీపీ కల్యాణి



మెడికల్ కిట్ అందజేస్తున్న ఎంపీపీ కల్యాణి, ఎంపీడీఓ రాధిక, తదితరులు

పూసపాటిరేగ: జగనన్న ఆరోగ్య సురక్షలో కార్పొరేట్ వైద్యం అందుతోందని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని కుమిలిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆన్‌లైన్‌లో రోగి వివరాలను నమోదు చేసే ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రోగులకు ఎంపీపీ చేతుల మీదుగా మెడికల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, గాబు సూరప్పన్నరెడ్డి, ఎంపీడీఓ ఎం. రాధిక, వైద్యాధికారి భాగ్యరేఖ, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలు భావితరాలకు ఆదర్శప్రాయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు భావితరాలకు ఆదర్శప్రాయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయం వద్దనున్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహనీయుల సేవలను నిరంతరం మననం చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించిన ఎంతోమంది మహనీయులు చరిత్రలో నిలిచిపోయారని గుర్తు చేశారు. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద త్వరలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని నెలకొల్పుతామని చెప్పారు. అలాగే నగరంలోని అనేక ప్రాంతాలలో సావిత్రిబాయిపూలే, ఛత్రపతి శివాజీ, వీరబ్రహ్మేంద్రస్వామి, అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్ వంటి మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కుమ్మరిగుంటి శ్రీనివాస్, వెత్సా శ్రీనివాసరావు, కాపుగంటి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడలో..

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై. మహేష్, పాఠకుల పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకోసం ప్రజా ఉద్యమం

విజయనగరం పూల్‌బాగ్: గాంధీ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ వర్ధంతి స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. జాతిపిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీనాయకులు రెడ్డి శంకరరావు, పి. రమణమ్మ, ఆర్. ఆనంద్, పుణ్యవతి, లక్ష్మి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

విజయనగరం టౌన్: కళాశాల బస్సులు నడిపే డ్రైవర్లు నిబంధనలు పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె. రవిశంకర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంవీజీఆర్ కళాశాలలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు -2024లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెలకువలను తెలుసుకుంటే డ్రైవింగ్ సులువవుతుందన్నారు. అదేవిధంగా ఆరోగ్యభద్రతపై పలు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఎ.వెంకటరమణ, వి.ఐశ్వర్యలక్ష్మి, ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన ర్యాలీ

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో కుష్టు నివారణపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాజావీధి, జాతీయ రహదారి, బూడివీధి మీదుగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్‌వర్మ మాట్లాడుతూ, కుష్టువ్యాధి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కుష్టువ్యాధి లక్షణాలున్నవారు స్వీయ పరీక్షలు నిర్వహించడానికి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించాలన్నారు. గ్రామాలలో నేటి నుంచి వచ్చే నెల 13 వరకు కుష్టువ్యాధి నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రమీలాదేవి, సీహెచ్‌ఓ వేదమణి, ఆర్‌వీ రమణ, బంగారుబాబు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి రహిత సమాజమే లక్ష్యం

విజయనగరం టౌన్: కుష్టువ్యాధి రహిత సమాజమే తమ లక్ష్యమని లెప్రసీ మిషన్, హీల్ ప్రాజెక్ట్ ప్రతినిధి తాలాడ దీప్తి అన్నారు. కుష్టువ్యాధి నిర్మూలన దినం సందర్భంగా భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుష్టురోగుల సంరక్షణ కోసం జాతిపిత మహాత్మాగాంధీ చేసిన ప్రయత్నాలు వ్యాధిగ్రస్తులందరికీ చేరేవిధంగా చూడాలని కోరారు. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీటీసీ ప్రిన్సిపాల్ ఫణి, హీల్ ప్రాజెక్ట్ ప్రోగ్రాం మేనేజర్ కిస్మత్ నందా, సీడీపీఓ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

అరెస్టులు అక్రమం

విజయనగరం అర్బన్: విశాఖపట్నంలో ఎస్ఎంయూ ప్రతినిధులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం స్థానిక డిపో గ్యారేజీ వద్ద ఎస్ఎంయూ జిల్లా కమిటీ ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారంపై ఈడీ పలుమార్లు హామీ ఇచ్చినా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఇటీవల జరిగిన చర్చల్లో రాష్ట్ర కమిటీ ఇచ్చిన 54 డిమాండ్లను పరిష్కరించడానికి యాజమాన్యం అంగీకరించినప్పటికీ, విశాఖపట్నంలో మాత్రం అమలు చేయడం లేదన్నారు. భీమిలిలో జరిగిన సభలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్న సంఘ నాయకులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంయూ జిల్లా అధ్యక్షుడు పీజీ రాఫిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సత్యం, డిపో అధ్యక్ష, కార్యదర్శులు బి. రామారావు, కె.చంద్రమౌళి, గ్యారేజ్ కార్యదర్శి కేవీఆర్ రాజు, రూపావతి, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.